క్లుప్తంగా

మొగిలిలో రాహుకేతు పూజలు

బంగారుపాళెం : మండలంలోని మొగిలి శివాలయంలో సోమవారం రాహుకేతు పూజలను ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వయంభు మొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మ మూలవర్లకు అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం ఉదయం 7.30 నుంచి 9 గంటల మధ్య రాహుకాల సమయంలో రాహు, కేతు, సర్పదోష నివారణ పూజలు చేపట్టారు. పెద్ద సంఖ్యలో భక్తులు రాహుకేతు పూజలు చేసుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఈవో మునిరాజులు, సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

ప్రతి రైతునూ ఆదుకుంటాం



రైతులకు చెక్కులు అందజేస్తున్న సర్పంచ్ గుణవతి, డీఆర్వో

ఐరాల: ఏనుగుల దాడిలో పంటలు నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకుంటామని స్థానిక సర్పంచ్ గుణవతి, డీఆర్వో జయశంకర్ తెలిపారు. వారు సోమవారం ఐరాల పంచాయతీలో ఏనుగుల దాడిలో పంటలు నష్టపోయిన ఏడుగురు రైతులకు చెక్కులు అందజేశారు. డీఆర్వో మాట్లాడుతూ మండలంలో ఏనుగుల దాడుల నివారణకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌బీవో పద్మావతి పాల్గొన్నారు.

దంతాల సంరక్షణపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ఎస్‌ఈ విజయకుమార్‌రెడ్డి

చిత్తూరు అగ్రికల్చర్: ప్రతి ఒక్కరూ దంతాల సంరక్షణపై అవగాహన కలిగి ఉండాలని జల వనరుల శాఖ ఎస్‌ఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. చిత్తూరు నగరంలోని జల వనరుల శాఖ కార్యాలయంలో సోమవారం ఉద్యోగులకు ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహించారు. ఆ శాఖ ఎస్‌ఈ విజయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఎంప్లాయ్ హెల్త్ కార్డు ద్వారా చిత్తూరులోని సుష్మ దంత వైద్యశాలలో ప్రభుత్వ ఉద్యోగులు ఉచితంగా శస్త్ర చికిత్సలు, వైద్యం చేయించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ మురళి, నాగభూషణం, మాజీ ఎస్‌ఈ సూర్యబాబు, శ్రీనివాసులురెడ్డి, వైద్యులు సుష్మ, సుకేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

19న ఆత్మగౌరవ సభ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డీఈవో కార్యాలయ సిబ్బంది

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరులో ఈ నెల 19న నిర్వహించనున్న ఆత్మగౌరవ సభ పోస్టర్లను సోమవారం డీఈవో కార్యాలయంలో ఏపీసీపీఎస్ఈఏ (ఏపీ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ అసోసియేషన్) ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సమీర్ మాట్లాడుతూ సీపీఎస్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఆత్మగౌరవ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం సీపీఎస్ ఉద్యోగుల డిమాండ్‌ను పరిశీలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఈవో కార్యాలయ సూపరింటెండెంట్లు సత్య, వీజీ రమణ, ఎన్జీవో నాయకులు మురళి తదితరులు పాల్గొన్నారు.

నేడు పత్తికొండలో ఉచిత వైద్య శిబిరం

గంగవరం : మండలంలోని పత్తికొండ పీహెచ్‌సీలో బెంగుళూరు వైదేహి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి మల్లికార్జునరెడ్డి సోమవారం తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ శిబిరం నిర్వహించనున్నట్లు చెప్పారు. క్యాన్సర్, గుండె, బీపీ, షుగర్, కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారు ఇక్కడ వైద్యపరీక్షలు చేసుకోవచ్చని, అవసరమైన వారికి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద మెరుగైన వైద్యసేవలు అందిస్తామన్నారు. దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బీఎస్‌ఎన్‌ఎల్ సెల్ టవర్లు మంజూరు

కార్వేటినగరం: బీఎస్‌ఎన్‌ఎల్ సిమ్ వాడే వినియోగదారుల కల త్వరలో నెరవేరనున్నట్లు ఎంపీపీ లత అన్నారు. సోమవారం మండలకేంద్రంలో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఎస్‌ఎన్‌ఎల్ వినియోగదారులు గ్రామాల్లో సిగ్నల్స్ రాక ఇబ్బంది పడేవారన్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి, చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప చొరవతో మండలంలోని గాజంకి, ఎర్రమరాజు, విజయమాంబాపురంలో సెల్‌టవర్లు ఏర్పాటుకు అనుమతులు మంజూరైనట్లు చెప్పారు. డిప్యూటీ సీఎం నారాయణస్వామి, చిత్తూరు ఎంపీ రెడ్డెప్పకు రుణపడి ఉంటామని తెలిపారు. ఎంపీపీ వెంట జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, స్థానిక సర్పంచ్ ధనంజయవర్మ పలువురు ఉన్నారు.

పాడి రైతులకు వెన్నుదన్ను

- డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవా వాహనాలతో ఇంటి వద్దే వైద్యం
- 1962కు ఫోన్ చేస్తే చాలు
- కష్టాలు తీరాయంటున్న పాడి రైతులు



రంగమ్మచెరువులో డాక్టర్ వైఎస్సార్ సంచార వాహనం వద్ద పశువుకు వైద్యం చేస్తున్న సిబ్బంది (ఫైల్)

ఐరాల: మూగజీవాల ప్రాణాలకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోంది. డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవా వాహనాలు ఏర్పాటుచేసింది. తద్వారా పశువులకు రైతుల ఇళ్ల వద్దనే వైద్య సేవలు అందిస్తూ వెన్నుదున్నుగా నిలుస్తోంది. 108 తరహాలో 1962 ఫోన్ చేస్తే గడప వద్దకే వచ్చి పశువులకు వైద్యం చేసేలా ఏర్పాటు చేసిన డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవా వాహనాలు పాడి రైతులకు బాసటగా నిలుస్తున్నాయి. ఒక్కో వాహనానికి ప్రభుత్వం రూ.37 లక్షలు వెచ్చించింది. ప్రతి అంబులెన్స్‌లోనూ పశువైద్యుడు, వెటర్నరీ డిప్లామా చేసిన సహవైద్యుడు, అటెండర్, డ్రైవర్ ఉంటారు. 1962 నంబరుకు ఫోన్ చేస్తే వైద్య సిబ్బంది పాడి రైతుకు ఫోన్ చేసి చిరునామాతో పాటు పశువు సమస్యను తెలుసుకుంటారు. వెంటనే పాడిరైతు చెంతకు చేరుకుంటారు. పశువు మల, మూత్ర, రక్త, పాల, గర్భధార పరీక్షలతోపాటు 15 రకాల పరీక్షలు నిర్వహిస్తారు. పేడకు సంబంధించే 20 రకాల పరీక్షలు నిర్వహిస్తారు. పాడి పశువులతో పాటు మేకలు, గొర్రెలు, పెంపుడు జంతువులకు కూడా సంచార పశు వైద్య సేవ ద్వారా వైద్యసేవలు అందిస్తున్నారు. పశుసంవర్ధక శాఖ డీడీ, ఏడీ పర్యవేక్షణలో ఈ వాహనం సేవలు అందిస్తోంది. అత్యాధునిక సాంకేతిక విలువలతో తయారు చేసిన ఈ వాహనం పశువుల పాలిట సంజీవినిగా మారింది.

సరైన సమయంలో పశువును రక్షించుకున్న



నా పశువు మేత మేస్తూ ఉన్నట్టు పడిపోయింది. ఏం చేయాలో తోచలేదు. వెంటనే మా కూతురు 1962 నంబరుకు ఫోన్ చేసింది. వైద్య సిబ్బంది పశువు పడిపోయిన ప్రాంతానికి వచ్చి వైద్యసేవలు అందించారు. ప్రస్తుతం నా పశువు ఆరోగ్యంగా ఉంది. డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య వాహన సేవ పెట్టిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– రమీజా, రంగమ్మచెరువు, ఐరాల

పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలి



ఇంటి వద్దే పశువైద్య సేవలు అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం డాక్టర్ వైఎస్సార్ సంచార పశువైద్య సేవను అందుబాటులోకి తెచ్చింది. దీనిపై అవగాహన లేకపోవడంతో చాలా మంది రైతులు పశువులను దూర ప్రాంతాల నుంచి ఆస్పత్రికి తీసుకువస్తున్నారు. రైతులు 1962 నంబరుకు ఫోన్ చేస్తే చాలు పశు వైద్య సిబ్బంది మీ వద్దకే వచ్చి సేవలు అందిస్తారు.

– పద్మావతి, ఏడీ పశుసంవర్ధక శాఖ, ఐరాల

అధ్వానంగా అంతర్రాష్ట్ర రహదారి



ఆర్‌అండ్‌బీ ఏఈపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సభ్యులు

యాదమరి: అంతర్రాష్ట్ర రహదారి మరమ్మతులను కాంట్రాక్టర్ సక్రమంగా చేయకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పలువురు సభ్యులు ఆరోపించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆర్‌అండ్‌బీ ఏఈ ఆదికేశవులు మాట్లాడుతుండగా తెల్లరాళ్లపల్లె, 184 గొల్లపల్లె సర్పంచులు భజలింగం, పరంధామ గౌడ్ అడ్డుకున్నారు. యాదమరి మీదుగా ఉన్న అంతర్రాష్ట్ర రహదారి గుంతలమయమైందన్నారు. దీనిపై ఎమ్మెల్యే ఎంఎస్‌బాబు, జెడ్పీ వైస్ చైర్మన్ ధనుంజయ రెడ్డికి విన్నవించగా రూ.50 లక్షలు మంజూరు చేయించారని తెలిపారు. కాంట్రాక్టర్ సక్రమంగా పనులు చేయకపోవడంతో రోడ్డు అధ్వానంగా మారిందని దుయ్యబట్టారు. దీనిపై ఫిర్యాదు చేసినా ఆర్‌అండ్‌బీ ఏఈ పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్‌అండ్‌బీ ఏఈ మాట్లాడుతూ ఈ రహదారిలో భారీ వాహనాలు వెళుతుండడంతో గుంతలు ఏర్పడుతున్నాయని తెలిపారు. దీంతో సభ్యులు ఏఈపై మండిపడ్డారు. జెడ్పీ వైస్ చైర్మన్ ధనుంజయరెడ్డి వారికి సర్దిచెప్పారు. ఉన్నతాధికారులు స్పందించి యాదమరి మండలం మీదుగా తమిళనాడుకు వెళ్లే అంతర్రాష్ట్ర రహదారిని బాగు చేయాలని కోరారు. తహసీల్దార్ హనుమంతు నాయక్ మాట్లాడుతూ మండలంలో ఉన్న పోలింగ్ కేంద్రాల్లో బీఎల్వోలు ఉన్నారని, ఓటు హక్కు లేనివారు తమ పేర్లు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని కోరారు. తాగునీటి సమస్యలు ఉన్న పంచాయతీల వివరాలు ఇస్తే సమస్యలు రాకుండా చూస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నవీన్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో శివరాజ్, వైస్ ఎంపీపీలు రవీంద్రబాబు, హరనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

జగనన్న పాలవెల్లువతో రైతులకు చేయూత

తవణంపల్లె: జగనన్న పాల వెల్లువతో పాడి రైతులకు చేయూత అందుతోందని ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్ తెలిపారు. మండలంలోని ఎ.గొల్లపల్లె, గాజులపల్లె, గోవిందరెడ్డిపల్లెలో సోమవారం జగనన్న పాల వెల్లువపై రైతులకు అవగాహన కల్పించారు. జగనన్న పాల వెల్లువ వల్ల రైతులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. పాడి రైతులకు గిట్టుబాటు ధరలు లభించడంతో పాటు ధరలు మీరే నిర్ణయించుకోవచ్చనని చెప్పారు.

త్వరితగతిన స్పందన వినతుల పరిష్కారం



వినతులు స్వీకరిస్తున్న నగర కమిషనర్ జె.అరుణ

చిత్తూరు అర్బన్: స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి అందే వినతులను వేగంగా పరిష్కరించాలని కమిషనర్ జె.అరుణ అధికారులను ఆదేశించారు. ఆమె సోమవారం నగరపాలక కార్యాలయంలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి వినతుల స్వీకరించారు. అనంతరం అధికారులతో చర్చించారు. వీటిని ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. గత వారం అందిన వినతుల పరిష్కారంపై సమీక్షించారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారమే టపాసుల విక్రయాలు



స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎస్‌ఐ

పూతలపట్టు: నిబంధనల ప్రకారమే టపాసుల దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలని తహసీల్దార్ విజయభాస్కర్, ఎస్‌ఐ సురేష్ తెలిపారు. దీపావళి పండుగ సమీపించడంతో విక్రయదారులు టపాసుల దుకాణాలకు ముందుగా అధికారుల అనుమతి తీసుకోవాలని సూచించారు. వారు సోమవారం పూతలపట్టులో స్థలాన్ని పరిశీలించారు. విక్రయదారులు ప్రజలకు ఇబ్బందులు లేకుండా, ప్రమాదాలు జరగకుండా జాగ్రత్త వహించాలన్నారు. దుకాణాల వద్ద అగ్ని ప్రమాదాలను నియంత్రించే అత్యవసరమైన నీరు, ఇసుక వంటి వాటిని ఉంచాలని సూచించారు.

ఉపాధ్యాయునికి కవితా పురస్కారం



ఉపాధ్యాయుడు షంషీర్‌ఖాన్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

బంగారుపాళెం: మండల కేంద్రమైన బంగారుపాళెం పట్టాణానికి చెందిన ఉపాధ్యాయుడు జీకే షంషీర్‌ఖాన్‌కు కవితా పురస్కారం లభించింది. తెలంగాణ రాష్ట్రం కరీంనగర్ ఫిలింనగర్‌లో ఆదివారం భవాని సాహిత్య వేదిక ఆధ్వర్యంలో జాతీయ శతాధిక కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు షంషీర్‌ఖాన్ 'ధనమేగా అన్నింటికీ మూలం' అనే కవిత వినిపించారు. ఈ కవిత 'కవన కలశం' అనే పుస్తకంలో ముద్రితమైంది. దాంతో ఉపాధ్యాయుడు షంషీర్‌ఖాన్‌ను భవాని సాహిత్య వేదిక అధ్యక్షుడు డాక్టర్ వైరాగ్యం ప్రభాకర్, జానపద అకాడమీ తొలి అధ్యక్షుడు డాక్టర్ పొట్లూరి హరికృష్ణ, సినీనటుడు, రచయిత, అక్కిరాజు సుందరరామకృష్ణ స్వర్ణ కంకణం తొడిగి, శాలువ కప్పి, జ్ఞాపికతో సన్మానించారు. మండలానికి చెందిన ఉపాధ్యాయునికి జాతీయ స్థాయి కవితా కవి సమ్మేళనంలో పురస్కారం లభించడంపై పలువురు ఉపాధ్యాయులు, మండల సాహితీవేత్తలు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

విద్యార్థులకు సాఫ్ట్‌బాల్‌లో ఉచిత శిక్షణ



సాఫ్ట్‌బాల్ శిక్షణను ప్రారంభిస్తున్న ఎంపీడీవో గౌరి

పూతలపట్టు: సాఫ్ట్‌బాల్ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు పూతలపట్టు ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్టు ఎంపీడీవో గౌరి తెలిపారు. ఆమె సోమవారం శిక్షణా తరగతులను ప్రారంభించారు. రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు బాలికల విభాగంలో మౌనిక, యువశ్రీ, భవిత, పవిత్ర, సల్మా, మహాలక్ష్మి, సోనియా, ధీక్షిన, అనన్య, అనిషా, ద్రాక్షాయిని, పూజ, ప్రవల్లిక, మంజుల, బాలుర విభాగంలో రోహిత్, దీపక్, ప్రకాష్, శ్రీనివాసులు, పవన్, బాలాజీ, లోహిత్, భానుప్రకాష్, వాసు, అజయ్, రాజ్‌కుమార్, మునిజీవన్, జానేష్, ఉమాశంకర్, తరుణ్ ఎంపికైనట్లు పీడీ కృష్ణయ్య, ఢిల్లీరాణి తెలిపారు. ఎంపీడీవో మాట్లాడుతూ విద్యార్థులు చదువులోను కాకుండా ఆటల్లోను రాణించాలని సూచించారు. కష్టపడి ఆడి పాఠశాలలకు మంచి పేరు తీసుకురావాలి విద్యార్థులకు సూచించారు. జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులు ఈనెల 11, 12వ తేదీల్లో గుంటూరులో జరగనున్న రాష్ట స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

యథేచ్ఛగా మట్టి అక్రమ రవాణా

- డీకేటీ భూములు, కొండలూ గుల్ల
- అడ్డుకున్న రైతన్నలు



మట్టి తవ్వకాన్ని అడ్డుకున్న గ్రామస్తులు

గుడిపాల: మండలంలో ఎర్రమట్టి అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. డీకేటీ భూములతోపాటు కొండలు, గుట్టలనూ వదలడం లేదు. దీనిపై ప్రశ్నించిన రైతులపై కేసులు నమోదు చేయిస్తున్నారు. మండలం గుండా చెన్నై–బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే రోడ్డు ఏర్పాటు చేస్తున్నారు. రోడ్డును ఎత్తు పెంచేందుకు మట్టి అవసరం. కిలారిపల్లెకు కొద్ది దూరంలో ఉన్న కొండ, దానికి ఆనుకుని సుమారు 25 మంది రైతులకు సంబంధించి 20 ఎకరాల డీకేటీ భూములు ఉన్నాయి. అక్కడ ఎర్రమట్టి ఎక్కువగా ఉండడంతో రోడ్డు కాంట్రాక్టర్ కన్ను డీకేటీ భూములతోపాటు కొండపై పడింది. రేయింబవళ్లు మట్టిని తవ్వి యథేచ్ఛగా తరలించారు. ఇలా కొండలో 70 శాతానికి పైగా మట్టిని తవ్వేశారు. గ్రామస్తులు మట్టిని తరలిస్తున్న వాహనాలను అడ్డుకున్నారు. వాహనాలను గ్రామంలోకి తీసుకువచ్చారు. మట్టి తరలించేందుకు అనుమతి గురించి ప్రశ్నించగా సమాధానం లేదు. వెంటనే ఎక్స్‌ప్రెస్ హైవే పనులు చేస్తున్న మోంటోకార్లో కంపెనీ యాజమాన్యం పోలీసులను రంగంలోకి దింపింది. పోలీసులు సోమవారం కిల్లారిపల్లె గ్రామానికి చేరుకున్నారు. తమ ఆధీనంలో ఉన్న డీకేటీ భూముల్లో మట్టిని ఎలా తరలిస్తారని రైతులు నిలదీయడంతో వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ విషయంపై గుడిపాల తహసీల్దార్ బాబూరాజేంద్రప్రసాద్ వివరణ ఇస్తూ మట్టిని తవ్వేందుకు తాము ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని తెలియజేశారు.

కొండను తవ్వితే గ్రామానికి ముప్పు:

కొండను పూర్తిస్థాయిలో తవ్వితే కిల్లారిపల్లెకు ముప్పు ఏర్పడుతుంది. కొండప్రాంతాన్ని ఆనుకుని కోమిటివాని చెరువు ఉంది. చెరువు నిండితే కొండ ప్రాంతం అడ్డుగా ఉంటుంది. కొండను పూర్తిస్థాయిలో తవ్వేస్తే చెరువు నీరు గ్రామంపైకి వస్తుందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు ప్రతి సంవత్సరం ఇదే కొండపై కార్తీక దీపం ఏర్పాటుచేసుకోవడం ఆనవాయితీగా వస్తోందని పేర్కొంటున్నారు. కొండను తవ్వేయడంతో తాము దీపాలు ఎక్కడ పెట్టుకోవాలని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

పాదయాత్రతో ప్రజాపాలన



జోహార్ వైఎస్సార్ అంటున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ అముద, నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: ప్రజాసంకల్పయాత్రలో ప్రజల కష్టాలను తెలుసుకుని ముఖ్యమంత్రి జగనన్న సుపరిపాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ అముద తెలిపారు. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప యాత్ర చేపట్టి ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం స్థానిక డీసీసీబీ ఆవరణలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్‌కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఎమ్మెల్యే, మేయర్ మాట్లాడుతూ ప్రజల కష్టాలను నేరుగా తెలుసుకోవడానికి నిర్వహించిన పాదయాత్రకు విశేష స్పందన లభించిందన్నారు. ఆ సమయంలో నవరత్నాలను, పలు హామీలను ఇచ్చారని గుర్తు చేశారు. ఇచ్చిన మాట ప్రకారం అధికారంలో వచ్చాక నేరవేర్చారన్నారు. కుల, మతాలు, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్టు వివరించారు. ప్రజాసంకల్ప యాత్ర వైఎస్సార్‌సీపీకి కొత్త ఉత్సాహాన్ని ఇచ్చిందన్నారు. జనమంతా జై కొడుతూ జగనన్న వెంట నడవడం మొదలుపెట్టారని వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షులు జ్ఞానజగదీష్, టిమ్మూ, నగర సచివాలయ కన్వీనర్లు రాంగణేష్, కిరణ్, కార్పొరేటర్లు నవీన్, లక్ష్మణన్, చల్లాముత్తు, నాయకులు చాన్‌బాషా, సీతాపతి, శేఖర్, సయ్యద్, రెడ్డెప్ప, నారాయణ, మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజల చెంతకే వైద్య సేవలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

ఐరాల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో ప్రభుత్వం ప్రజల చెంతకే మెరుగైన వైద్యసేవలు అందిస్తోందని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని 35 యర్లంపల్లెలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనం ద్వారా 65 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేశారు. మంచానికే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య స్థితిని తెలుసుకుని వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, పీహెచ్‌ఎన్ జీవకళ, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



గుడిపాల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ రష్మిత

ఫ్యామిలీ ఫిజీషియన్‌తో ఇంటి వద్దకే వైద్యం

గుడిపాల: రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌తో ప్రజలకు ఇంటి వద్దే వైద్యం అందుతోందని బొమ్మసముద్రం వైద్యాధికారి రష్మిత తెలిపారు. కమ్మతిమ్మాపల్లెలో సోమవారం గర్భిణులు, బాలింతలు, కిషోరబాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం బీపీ, షుగర్ ఉన్న వారికి పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారికి ఇంటి వద్దే వైద్య సేవలు అందించారు. వైద్య సిబ్బంది శ్రీలక్ష్మి, సరిత, శిల్ప, కిరణ్‌కుమారి పాల్గొన్నారు.

అర్హులను ఓటర్లుగా నమోదు చేయడమే లక్ష్యం



మాట్లాడుతున్న తహసీల్దార్ గుణశేఖర్ రెడ్డి, ఎన్నికల ప్రత్యేక పర్యవేక్షణాధికారి గోవిందరాజులు

తవణంపల్లె: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మండలంలో అర్హులను ఓటర్లుగా నమోదు చేయిండమే లక్ష్యంగా పని చేస్తున్నామని తవణంపల్లె తహసీల్దార్, అసిస్టెంట్ ఎలక్ట్రోల్ రిటర్నింగ్ అధికారి గుణశేఖర్ రెడ్డి తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలో శని, ఆదివారాలు ఓటు నమోదుపై ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఇందులో మరణించిన, వలస వెళ్లిన, రెండు చోట్ల ఓట్లు నమోదైన వారి తొలగింపునకు 501 క్లైమ్‌లు వచ్చినట్లు తెలిపారు. వీటిపై అభ్యంతరాలను 12వ తేదీ లోపు బీఎల్‌వోకు తెలియజేయాలన్నారు. కొత్త ఓటు నమోదుకు 249 క్లైమ్‌లు, ఓటరు కార్డులో తప్పులను సరిచేయడానికి 116 క్లైమ్‌లు వచ్చినట్లు వివరించారు. ఓటరు నమోదు కార్యక్రమం డిసెంబర్ 31వ తేదీ వరకు జరుగుతుందని వివరించారు. 2024వ జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఫాం–6 దరఖాస్తు చేసుకోవచ్చునని వెల్లడించారు. సమావేశంలో మండల ఎన్నికల ప్రత్యేక పర్యవేక్షణాధికారి, ఆర్‌అండ్‌బీ డీఈ గోవిందరాజులు, భూ సర్వే డీటీ వెంకటరమణ పాల్గొన్నారు.




మాట్లాడుతున్న కమిషనర్ జె.అరుణ

ఓటరుగా నమోదు పౌరుల బాధ్యత

చిత్తూరు అర్బన్: 18 సంవత్సరాలు నిండిన వారు ఓటరుగా పేర్లు నమోదు చేసుకోవడం ఒక బాధ్యతగా గుర్తించాలని ఏఈఆర్వో, కమిషనర్ జె.అరుణ తెలిపారు. చిత్తూరులోని రుక్మిణి కృష్ణస్వామి డిగ్రీ కళాశాలలో సోమవారం ప్రత్యేక ఓటర్ల సవరణ–2024లో భాగంగా 18 సంవత్సరాలు నిండిన వారికి ఓటరుగా నమోదుపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ 2024 జనవరి 1వ తేదీకి 18 ఏళ్లు నిండే వారందరూ కచ్చితంగా ఓటు హక్కు నమోదు చేసుకోవాలన్నారు. ఇందుకోసం కళాశాల స్థాయిలోనే అధికారులు, బీఎల్వోలు అందుబాటులో ఉంటారన్నారు. ఫారం –6 దరఖాస్తులను పూర్తిచేసి ఓటు హక్కు పొందాలన్నారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ బాబు, ఆర్వో గోపాలకృష్ణ వర్మ, ఆర్‌ఐ అమర్నాథ్ రెడ్డి పాల్గొన్నారు.

అతిసారంపై అప్రమత్తం

- అధికారుల పర్యవేక్షణ
- కొనసాగుతున్న ఇంటింటా సర్వే, వైద్య శిబిరం
- మరో నాలుగు కేసులు నమోదు




తుమ్మిందలో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న డీఐవో రవిరాజు, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలం తుమ్మింద గ్రామంలో నమోదైన అతిసార కేసులపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, మండల అధికారులు అప్రమత్తమయ్యారు. వారు సోమవారం గ్రామంలో సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా మరో నాలుగు కేసులు బయటపడ్డాయి. వారిని శిబిరానికి తీసుకెళ్లి వైద్య సేవలు అందిస్తున్నారు. గ్రామంలో అతిసారం ప్రబలడానికి తాగునీటి కలుషితం కారణమని గుర్తించారు. దీంతో ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. గ్రామంలో ఉన్న పేడ దిబ్బలను తొలగించారు. మురుగు కాలువల్లో పూడిక తీయించారు. తాగునీటి ట్యాంకును శుభ్రం చేయించి పైపులైన్ లీకేజీలపై ఆరా తీశారు. ఊరంతా బ్లీచింగ్ చల్లించారు. గ్రామ తాగునీటి నుంచి సరఫరా అయ్యే తాగునీటిని పూర్తిగా నిషేధించారు. ట్రాక్టర్ ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు.

శిబిరం కొనసాగింపు...

గ్రామంలో మరో నాలుగు అతిసారం కేసులు నమోదు కావడంతో వైద్య శిబిరాన్ని మరో మూడు రోజులు కొనసాగించాలని నిర్ణయించారు. డీఐవో రవిరాజు గ్రామాన్ని సందర్శించి పారిశుద్ధ్యం, తాగు నీటి సరఫరాపై ఆరా తీశారు. బాధితులను పరామర్శించి వారి ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు. ఇళ్లకు సరఫరా చేస్తున్న నీటిలో క్లోరిన్ మాత్రలు వేయాలని సూచించారు.

ఉద్యోగ విరమణ చేసే టీచర్ల వివరాలు సేకరించాలి



డీఈవోకు వినతి పత్రం ఇస్తున్న యూటీఎఫ్ నేతలు

చిత్తూరు కలెక్టరేట్ : రాబోయే విద్యాసంవత్సరంలో ఉద్యోగ విరమణ చేసే టీచర్ల ఖాళీల వివరాలు సేకరించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమశేఖర్‌నాయుడు, జీవీ రమణ కోరారు. వారు సోమవారం డీఈవో విజయేంద్రరావును కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ నిర్వహణకు కసరత్తు చేస్తున్న నేపథ్యంలో జిల్లాలో ఖాళీల వివరాలను విద్యాశాఖ అధికారులు సేకరిస్తున్నారని పేర్కొన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో ఉద్యోగ విరమణ చేసే టీచర్లను దృష్టిలో ఉంచుకుని వివరాలు సేకరించాలని కోరారు. ఈ ఏడాదిలో జిల్లా వ్యాప్తంగా రూ.2500 అలవెన్సుతో ఉద్యోగోన్నతులు ఇచ్చారని చెప్పారు. ఆ అలవెన్సుల మంజూరుకు డీఈవో కార్యాలయం నుంచి ట్రెజరీకి ఉత్తర్వులు పంపాలని కోరారు. అనంతరం పలు అంశాలపై డీఈవోతో చర్చించారు. సానుకూలంగా స్పందించిన డీఈవో డిమాండ్లను ప్రభుత్వానికి పంపుతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం మహిళా కన్వీనర్ సరిత, నాయకులు సుధాకర్‌రెడ్డి, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.